క్లుప్తంగా

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



ఎరువుల దుకాణంలో స్టాక్ వివరాలను ఆరా తీస్తున్న ఏడీఏ రామ్‌కుమార్‌రెడ్డి

కొలిమిగుండ్ల: ఎరువులను రైతులకు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏడీఏ రామ్ కుమార్‌రెడ్డి హెచ్చరించారు. మండల పరిధిలోని తిమ్మనాయినపేట జంక్షన్‌లో ఉన్న ఎరువుల దుకాణాలను మంగళవారం ఏడీఏ తనిఖీ చేశారు. ఎరువుల వివరాలు, స్టాక్ రిజిష్టర్లను పరిశీలించారు. ఎక్కువ ధరలకు అమ్ముతున్నట్లు ఫిర్యాదులోస్తే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట ఏఓ పవన్ కుమార్ పాల్గొన్నారు.

అవుకు: పట్టణంలోని మన గ్రోమోర్ ఎరువుల దుకాణాన్ని మంగళవారం ఆళ్లగడ్డ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు రామ్మోహన్ రెడ్డి తనిఖీ చేశారు. స్టాక్ రికార్డులను, బిల్లులను పరిశీలించారు. అనంతరం గోడౌన్‌ను తనిఖీ చేసి ఎరువుల నిల్వలపై ఆరా తీశారు. యూరియా సరిపడా ఉందని, రైతులు ఎలాంటి ఆందోళన చెందకుండా ప్రైవేట్ దుకాణాదారుల వద్ద మోసపోవద్దని ఈ సందర్భంగా ఆయన సూచించారు. కార్యక్రమంలో అవుకు, దొర్నిపాడు వ్యవసాయ అధికారులు ప్రసాద్ రావు, శ్రీక్రిష్ణ, గ్రోమోర్ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు వర్తింప చేయాలి

బనగానపల్లెరూరల్: అంగన్‌వాడీ వర్కర్లకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింప చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు షేబా కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి వినతి పత్రాన్ని ప్రాజెక్టు సీనియర్ అసిస్టెంట్ చంద్రమోహన్‌కు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయు నాయకులు సుబ్బయ్య, అంగన్ వాడీ నాయకురాలు రమాదేవి, మల్లేశ్వరి, హేమలత, నాగలచ్చుమ్మ, పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు అన్యాయం చేస్తున్న బీజేపీ ప్రభుత్వం

డోన్ రూరల్ : బీజెపి ప్రభుత్వం విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ చేస్తు కార్మికులకు, ఉద్యోగులకు తీరని అన్యాయం చేస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజినేయులు తెలిపారు. ఈ మేరకు స్థానిక ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట రెండోరోజు మంగళవారం కొనసాగిన నిరాహార దీక్షలో రామాంజనేయులు మాట్లాడారు. ప్రైవేటీకరణను అపకపోతే ఉద్యమం తప్పదనీ హెచ్చరించారు. 30వ తేదీన విశాఖలో కార్మికులతో పెద్దఎత్తున గర్జన నిర్వహిస్తున్నామన్నారు.

సమాజ సేవయే వాసవీ క్లబ్ ధ్యేయం

బేతంచెర్ల: సమాజంలోని అట్టడుగు వర్గాల అభివృద్ధే ధ్యేయంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వాసవీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సూర్య బళ్లాని,గుప్త అన్నారు. మంగళవారం పట్టణంలోని అమ్మవారి శాలకు వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో రూ.10 వేల విలువచేసే వీఐపీ కుర్చీలను బహూకరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గుండా గోపాలు, సుబ్రమణ్యం,సభ్యులు కందగడ్డల మోహన్ రావు, రాజేంద్ర, మురళి, విష్ణు, ధనుంజయ పాల్గొన్నారు.

లింగ వివక్ష విడనాడాలి

ప్యాపిలి: లింగ వివక్షతను విడనాడి ఆడపిల్లలను ఉన్నత చదువులు చదివించాలని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ నాయకులు మత్తు బాబా సాహెబ్, ప్రియదర్శిని పాఠశాల హెచ్‌ఎం పార్థసారధి అన్నారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ప్రియదర్శిని స్కూల్ విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నతనం నుంచే ఆడపిల్లలను అన్నివిషయాల్లో ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది ఎస్ఆర్ బేగం, వెంకటస్వామి, ఈశ్వరమ్మ, మమత, సురేఖ, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

సంతాపం

కోవెలకుంట్ల: కర్నూలు జిల్లా ఆదోని చెందిన ఏపీ రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరసింహయ్య మృతిపట్ల మంగళవారం పలువురు సంతాపం ప్రకటించారు. నరసింహయ్య సోమవారం గుండెపోటుతో మృతి చెందడంతో పట్టణంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు సంతాపం తెలిపారు. స్థానిక జీవీ కొండారెడ్డి స్మారక గ్రంథాలయంలో అఖిలభారత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బాలయ్య, రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్బారెడ్డి, చిన్నవ్యాపారుల సంఘం అధ్యక్షుడు రామపుల్లయ్య తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కరీంబాషా, సుబ్బరాయుడు, బాషా తదితరులు పాల్గొన్నారు.

ప్యాపిలి: మండల పరిధిలోని మాధవరం గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ కిరణ్ మృతి పట్ల మోటార్ వర్కర్స్ యూనియన్ నాయకులు భాస్కర్ రెడ్డి, శివరాం తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు మంగళవారం మృతుడి భౌతికకాయం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం వారు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో లక్ష్మన్న, లక్ష్మీనారాయణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా సంక్షేమ సిరులు

- గడప గడపలో ఆప్యాయత
- జగన్ వెంటే జనం
- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

కోవెలకుంట్ల: మూడున్నరేళ్ల పాలనలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందించిన పథకాలతో ప్రతి ఇంటా సంక్షేమ సిరులు నెలకొన్నాయని, గడప గడప కార్యక్రమంలో ప్రజల నుంచి లభిస్తున్న ఆప్యాయతే ఇందుకు నిదర్శనమని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. కోవెలకుంట్ల మేజర్ గ్రామ పంచాయతీలోని ఐదవ సచివాలయ పరిధిలో మంగళవారం ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఏపీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కర్రా గిరిజా హర్షవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు గోపిరెడ్డి వెంకటలక్ష్మమ్మ, సర్పంచ్ మెట్ల సరళ, ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ బీవీ నాగార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ డాక్టర్ల విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రామిరెడ్డి, మండల ఉపాధ్యక్షురాలు షాజహాన్, కోప్షన్ మెంబర్ దిల్కీబాషా, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రాంమోహన్‌రెడ్డి, మండల ఇన్‌చార్జ్ భీమిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, న్యాయ విభాగ జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, సీనియర్‌నాయకులు మాచిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, చిక్కేపల్లి రామకృష్ణారెడ్డి, అమడాల శంకరయ్య, రైతు సంఘం అధ్యక్షుడు కానాల రవీంద్రనాథ్‌రెడ్డి తదితరులతో కలిసి కాలనీల్లో విస్తృతంగా పర్యటించారు. దాదాపు 720 గడపలను సందర్శించిన ఎమ్మెల్యే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతోపాటు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, ఇళ్లస్థలాలు, పక్కాగృహాలు మంజూరు చేయాలని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. స్పందించిన కాటసాని మౌలిక సదుపాయాల కల్పనకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేశారు.

ఓర్వలేకనే దుష్ప్రచారం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కుల, మతాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు వర్తింప చేస్తోంటే ఓర్వలేక మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు డైరెక్షన్‌లో ఎల్లోమీడియా దుష్ప్రచారం చేస్తోందని ఎమ్మెల్యే కాటసాని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాదయాత్ర సమయంలో ప్రజల కష్ట, నష్టాలు తెలుసుకుని అధికారంలోకి రాగానే సీఎం జగనన్న అర్హతే ప్రామాణికంగా నవరత్న పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుస్తున్నారన్నారు. గ్రామ స్థాయిలో పరిపాలనను వికేంద్రీకరణ చేస్తూ గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థతో ప్రజల ముంగిటకే పథకాలు తీసుకొచ్చారని పేర్కొన్నారు. జనం జగనన్న వెంటే ఉన్నారని, వారి ఆశీస్సులు, దీవెనలు జగనన్నకు కొండంత బలమన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీకి మరోసారి గుణపాఠం చెప్పి రెండోసారి వైఎస్సార్‌సీపీకి ప్రజలు పట్టం కడతారని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఎల్వీ సుధాకర్‌రెడ్డి, లోకేశ్వరరెడ్డి, డీవీ శేషిరెడ్డి, మోహన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, బాలమద్దిలేటి, ఎంపీడీఓ మహబూబ్‌దౌలా, తహసీల్దార్ పుష్పకుమారి, ఈఓపీఆర్‌డీ రాధిక,ఆర్‌డబ్ల్యుఎస్, ట్రాన్స్‌కో ఏఈలు హరీష్, రామసుబ్రమణ్యం, మండల వ్యవసాయాధికారి నిరంజన్, వైఎస్సార్‌సీపీ నాయకులు గువ్వల రామకృష్ణారెడ్డి, వీరారెడ్డి, శ్రీనివాసరెడ్డి, నాగార్జున రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఎల్ఐసీ రామసుబ్బారెడ్డి, చిక్కేపల్లి ప్రసాదరెడ్డి, అక్బర్‌బాషా పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మనప్రభుత్వం

పట్టణంలోని ఐదవ గ్రామ సచివాలయ పరిధిలో రెండవ రోజు బుధవారం గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం కొనసాగుతుందని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రాంమోహన్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి స్వామినగర్, ఇందిరమ్మ కాలనీల్లో పర్యటించి సంక్షేమ పథకాల లబ్ధిపై ప్రజలకు వివరిస్తారన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు డోన్ విద్యార్థిని



స్పందన

డోన్ టౌన్: అండర్ 17 స్కూల్ గేమ్స్‌లో భాగంగా వాలీబాల్ విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచి జాతీయ స్థాయి పోటీలకు డోన్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థిని స్పందన ఎంపికైనట్లు హెచ్‌ఎం గంగిరెడ్డి తెలిపారు. కర్నూలు ఏ-క్యాంపు మాంటిసోరీ పాఠశాలలో 66వ రాష్ట్ర స్థాయి పోటీల్లో స్పందన ఉత్తమ ప్రతిభ కనబరచినట్లు చెప్పారు. స్పందనను ఆయనతో పాటు వ్యాయామ ఉపాధ్యాయుడు సునీల్, ఉపాధ్యాయులు అభినందించారు.

వ్యవసాయ రంగంపై ఉచిత శిక్షణ

బనగానపల్లె: మండలంలోని యాగంటిపల్లె గ్రామ సమీపంలో ఉన్న కృషివిజ్ఞాన కేంద్రం(కేవీకే)లో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో వ్యవసాయం రంగంపై ఉచిత శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు కేవీకే ప్రధాన సీనియర్ శాస్త్రవేత్త ధనలక్ష్మీ మంగళవారం తెలిపారు. క్వాలిటీ సీడ్ గ్రోవర్, హర్టికల్చరిస్ట్ ప్రొటెక్టెడ్ కల్టివేషన్ వంటి కోర్సుల్లో మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఉంటుందన్నారు. పదవ తరగతి ఆపై చదవిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ధనలక్ష్మీ తెలిపారు.

ఆర్వో ప్లాంటును ప్రారంభించిన మంత్రి బుగ్గన



అసోసియేషన్ కార్యదర్శి పురుషోత్తంతో రిబ్బన్ కటింగ్ చేయిస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

బేతంచెర్ల: స్థానిక అయ్యల చెర్వులో ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ గ్రానైట్ స్టోన్ ఇండస్ట్రీ, బేతంచెర్ల లైమ్ స్టోన్ స్లాబ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.10 లక్షలతో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను మంగళవారం మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అసోసియేషన్ కార్యదర్శి పురుషోత్తంతో రిబ్బన్ కటింగ్ చేయించి ప్రారంభించారు. కార్మికుల సౌకర్యార్థం ఆర్వో వాటర్ ప్లాంట్‌కు ఏర్పాటుకు స్థలం ఇచ్చిన దాత మిలాప్‌చంద్ జైన్‌ను, అసోసియేషన్ సభ్యులను మంత్రి అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు హుసేన్‌రెడ్డి, అధ్యక్షు చలం రెడ్డి, సభ్యులు జశ్వంత్‌రెడ్డి, నూర్ కమాల్, శేఖర్, మురళీ కృష్ణ, నూరుల్లా ఖాద్రీ, మూర్తుజావలీ పాల్గొన్నారు.

సబ్‌పోస్టాఫీస్ నూతన భవనానికి నిధులు మంజూరు



పాత భవనాన్ని పరిశీలిస్తున్న పోస్టల్ ఎస్పీ శ్రీనివాసులు

ప్యాపిలి: స్థానిక సబ్ పోస్టాఫీస్ నూతన భవనానికి రూ. 26 లక్షలు మంజూరైనట్లు కర్నూలు డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ (పోస్టల్ ఎస్పీ) శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం ఆయన శిథిలావస్థలో ఉన్న పాత భవనాన్ని పరిశీలించారు. అనంతరం పోస్టల్ ఎస్పీ మాట్లాడుతూ పట్టణంలో పాత భవనం శిథిలావస్థలో ఉండటంతో కొద్ది సంవత్సరాలుగా అద్దె భవనంలోనే తపాలా కార్యాలయం కొనసాగుతోందన్నారు. దీంతో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారన్నారు. త్వరలో పనులు ప్రారంభం అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజినీర్ చంద్రశేఖర్, డోన్ సబ్‌డివిజన్ ఇన్‌స్పెక్టర్ అభిషేక్, ప్యాపిలి సబ్ పోస్టుమాస్టర్ రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

వీఏఏలు రైతులకు అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న ఏఓ ప్రసాద్ రావు

అవుకు: గ్రామ వ్యవసాయ సహాయకులు ఎల్లప్పుడూ రైతులకు అందుబాటులో ఉండాలని వ్యవసాయ అధికారి శ్రీధర్ రావు సూచించారు. మంగళవారం అవుకు మండలంలోని కునుకుంట్ల, ఉప్పలపాడు, కొంమనాయునిపల్లె గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాలను ఏఓ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈకేవైసీ చేయించుకోకపోతే వ్యవసాయ రంగానికి సంబంధించి ప్రభుత్వ పథకాలకు అనర్హులు అవుతారని విషయాన్ని రైతులకు వీఏఏలకు వివరించి చైతన్య పరచాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏలు భాను, జయక్రిష్ణ, శారద తదితరులు పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనులు ప్రారంభించనున్న కాటసాని

బనగానపల్లె: పట్టణంలో బుధవారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి చేతుల మీదుగా పలు అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్నట్లు జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి మంగళవారం తెలిపారు. రూ.1.20 కోట్లతో నిర్మించిన ఎంపీడీఓ కార్యాలయ భవనం, రూ.40లక్షలతో నిర్మించిన సచివాలయం-2 భవనం, రూ.40లక్షలతో నిర్మించిన స్టేట్‌బ్యాంక్ రోడ్డును ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఎంపీపీ మానసవీణ, జెడ్పీటీసీ సభ్యురాలు లక్ష్మీసుబ్బమ్మ, సర్పంచ్ ఈసారి యల్లమ్మ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొంటారని వివరించారు.

వేధింపుల కేసు నమోదు

బేతంచెర్ల: మండల పరిధిలోని కనుమకింది కొట్టాల గ్రామానికి చెందిన నాగేంద్రమ్మ తనకు మగ పిల్లలు పుట్టలేదని భర్తతో పాటు బంధువులు వేధింపులకు గురి చేస్తూ కొట్టారని చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ లింగమయ్య మంగళవారం తెలిపారు. వివరాల మేరకు కనుమ కింది కొట్టాలకు చెందిన మధు మోహన్‌తో బేతంచెర్ల పట్టణానికి చెందిన నాగేంద్రమ్మకు 13 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ముగ్గురు ఆడ పిల్లలు. భర్తతో పాటు ఆయన బంధువులు ఏడుగురు వ్యక్తులు... తనకు మగపిల్లలు పుట్టలేదని వేధింపులకు పాల్పడడంతోపాటు కొట్టారని బాధితురాలి ఫిర్యాదు చేశారని ఏఎస్ఐ తెలిపారు.

ఆడపిల్లల సంరక్షణ అందరి బాధ్యత



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



మానవహారం నిర్వహించిన విద్యార్థినులు



బహుమతి అందిస్తున్న సీడీపీఓ షంషాద్‌బేగం

కోవెలకుంట్ల: ఆడపిల్లల సంరక్షణ అందరి బాధ్యతని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శాంత అన్నారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మండల కేంద్రమైన సంజామలలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజాన్ని మార్చగలిగే శక్తి బాలికలకు ఉందన్నారు. మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. అనంతరం ఆడపిల్లలను రక్షిద్దాం, ఆడ పిల్లలను చదివిద్దాం అని నినదిస్తూ ప్రతిజ్ఞ చేశారు. బాలికా దినోత్సవం సందర్భంగా విద్యార్థినీలకు వ్యాసరచన, ఉపన్యాస, చిత్రలేఖన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీలేఖ, మహిళా పోలీస్ రసూల్‌బీ, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

బనగానపల్లెరూరల్: బాలికలు అన్నిరంగాల్లో ప్రతిభ చూపించాలని వృక్షశాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్ వసుంధర పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బనగానపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ ఉమామహేశ్వరమ్మ ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకురాలు డాక్టర్ వసుంధర మాట్లాడుతూ బాలికలకు బాలురతో సమానంగా అవకాశాల ఉన్నాయని, ప్రభుత్వం బాలికా విద్యను ప్రోత్సహిస్తుందని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జాతీయ బాలిక దినోత్సవం ప్రాముఖ్యతను సీడీపీఓ ఉమామహేశ్వరమ్మ వివరించారు. అనంతరం కళాశాల నుంచి పెట్రోల్ బంకు వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు నీతమ్మ, వహిదా, పీడీ విజయలక్ష్మీ, సూపర్ వైజర్లు సుగుణ చిట్టెమ్మ, సాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: మండలంలో జాతీయ బాలికా దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కొలిమిగుండ్లలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీవాణి ఆధ్వర్యంలో వివిధ గ్రామాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు విద్యార్థినులతో కలిసి ఉన్నత పాఠశాల నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. తుమ్మలపెంట సమీపంలోని అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ ఆధ్వర్యంలో అంకిరెడ్డిపల్లె ఉన్నత పాఠశాలలో వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. చింతలాయిపల్లెలోని సమత సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాలికా దినోత్సవ వేడుకల్లో ఎంపీపీ కారపాకుల నాగవేణి పాల్గొన్నారు.

అవుకు: మహిళలు,బాలికల సంరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని సీడీపీఓ ఉమామహేశ్వరమ్మ, ఎంఈఓ శ్రీధర్ రావు సూచించారు. మంగళవారం జాతీయ బాలికల దినోత్సవం అవుకులోని జెడ్పీహెచ్ బాలికల, కస్తూర్బా గాంధీ బాలికల, గుండ్లశింగవరం జెడ్పీహెచ్ పాఠశాలల్లో సీడీపీఓ, ఎంఈఓ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల పెంపకంలో బాలబాలికల మధ్య తేడాలు చూపకుండా సమానంగా చూసుకోవాలన్నారు. మహిళలు, బాలికలపై హత్యాచారాలను అరికట్టటానికి ప్రభుత్వాలు అమలు చేస్తున్న చట్టాలను తెలుసుకోవాలన్నారు. బాలికల ఆరోగ్యానికి, వారి విద్యాభివృద్ధికి, ఉన్నత చదువులకు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అవుకులో బేటీ బచావో- బేటీ పడావో నినాదంతో బాలికలు మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్లు నాగసుంకమ్మ, శివమ్మ, హెచ్‌ఎం సత్యనారాయణ, కేజీబీవీ ఇన్‌చార్జ్ ఎస్ఓ భారతీ, హెడ్ కానిస్టేబుల్ సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

డోన్ రూరల్: చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ షంషాద్‌బేగం బాలికలకు సూచించారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం సూపర్‌వైజర్ పరమేశ్వరి ఆధ్వర్యంలో బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థినులు పాఠశాల నుంచి పాతబస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందచేశారు. సీడీపీఓ షంషాద్‌బేగం బాల్య వివాహాల మూలంగా జరిగే అనర్థాలను వివరించారు.

డోన్ టౌన్: ఆడపిల్లలు అభివృద్ధి చెందినప్పుడే సమాజం అభివృద్ధిలో పయనిస్తుందని హెచ్‌ఎం పద్మావతమ్మ అన్నారు. జాతీయ బాలికల దినోత్సవాన్ని పురష్కరించుకొని మంగళవారం పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో బాలికలతో సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడ పిల్లలపట్ల వివక్ష తగదన్నారు. ఆడపిల్లల ఉన్నత విద్యలు చదువాలని సూచించారు.

కనుల పండువగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

బేతంచెర్ల: మండల పరిధిలోని హెచ్ కొట్టాలలో వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో మాగమాస శుద్ధ తదియ మంగళవారం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణం కనులల పండువగా నిర్వహించారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మిదేవి, ఆలయ నిర్వాహకులు లక్కుం పల్లె వెంకట్రాముడు, లక్ష్మిదేవి, ఓబులేసు, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై సదస్సు

డోన్ : 34వ జాతీయ రహదారి భద్రత వారోత్సవాలలో భాగంగా మంగళవారం పట్టణం సమీపంలోని ఆర్‌టీఓ కార్యాలయంలో ఎంవీఐ క్రాంతికుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు రోడ్డు నిబంధనలను ఈ సందర్భంగా ఎంవీఐ వివరించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందించారు.

పోస్టర్ల ఆవిష్కరణ

బనగానపల్లెరూరల్: నంద్యాలలో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 26న నిర్వహించ తలపెట్టిన ట్రాక్టర్ ర్యాలీ పోస్టర్లను మంగళవారం స్థానికంగా ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సుబ్బరాయుడు రైతులతో కలిసి ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడానికి ప్రయత్నిస్తోందని, రైతులు ఐకమత్యంగా ఉద్యమించాలని సుబ్బరాయుడు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ డివిజన్ నాయకులు సుబ్బయ్య, రైతులు వీకే మద్దిలేట, సాలన్న, పూల రాజు, గిడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

ఒకరిపై ఒకరు పిడిబాకుతో దాడి

డోన్ రూరల్ : పట్టణంలోని కొండపేటకు చెందిన యువకులు బోయ సాయికుమార్, మసూద్ మంగళవారం పిడిబాకుతో ఒకరిపైఒకరు దాడి చేసుకున్నారు. బాధితుడు సాయికుమార్ తెలిపిన వివరాల మేరకు... మసూద్ అనే వ్యక్తి మా అన్న విజయ్‌కుమార్‌కు డబ్బులు ఇవ్వాల్సి ఉందన్నారు. అడబ్బులను తిరిగి ఇవ్వాలని మా అన్న కోరగా మేము ఇవ్వమని మరోవ్యక్తి రవి అన్నాడన్నారు. ఇది పద్ధతి కాదంటుండగానే నా కళ్లలో కారంచల్లి పిడుబాకుతో దాడి చేశారని, అదే బాకుతో తాను దాడి చేశానన్నారు. అయితే బోయసాయికుమార్, చందు, చిన్న, కుమార్ అనే వ్యక్తులు తన కళ్లలో కారం చల్లి పిడిబాకుతో దాడి చేసి గాయపరిచారని మరో బాధితుడు మసూద్ తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. గాయపడిన ఇద్దరిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా డాక్టర్లు పరిశీలించారు. మసూద్‌కు గాయాలు తీవ్రంగా కావడంతో కర్నూలుకు రెఫర్ చేశారు.

సత్కారం

డోన్ : ఈనెల 23వ తేదీన నేతాజీ సుభాష్ చంద్ర బోస్ 126వ జయంతిని పురస్కరించుకొని పరాక్రమ దివాస్‌ను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిస్వార్థంగా సేవలందిస్తున్న సంస్థల నిర్వాహకులను మంగళవారం కర్నూలు దేవి ఫంక్షన్‌హాల్‌లో సత్కరించారు. యువ భారత్ సేవాసమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డోన్‌కు చెందిన ద్రోణాచలం సేవాసమితి వ్యవస్థాపకులు షాధిఖాన రాజును పట్టు శాలువ, మెమోంటోతో సత్కరించారు.



గతంలో సంజామల- పేరుసోముల రహదారి దుస్థితి



ప్రస్తుతం కళకళలాడుతున్న బీటీ రోడ్డు

'రాచ'బాటలు

కోవెలకుంట్ల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సంక్షేమంతోపాటు అభివృద్ధికి పెద్దపీట వేసింది. గ్రామీణ రోడ్లకు ప్రాధాన్యత నిస్తూ అతుకులు, గతుకుల రోడ్లపై ఏళ్లతరబడి ప్రయాణాలు సాగిస్తూ అవస్థలు పడుతున్న ప్రజల కష్టాలు తీర్చుతూ రాచబాటలు వేసింది. మండల కేంద్రం సంజామల నుంచి పేరుసోమల గ్రామానికి 14 కిమీ మేర ఉన్న రోడ్డు శిథిలావస్థకు చేరుకుని ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. సంజామల, కొలిమిగుండ్ల మండలాల్లోని వివిధ గ్రామలకు, అనంతపురం జిల్లా తాడిపత్రి, వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు, ప్రొద్దుటూరు పట్టణాలకు దగ్గరి మార్గం కావడంతో ఈ రహదారిలో నిత్యం వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. దెబ్బతిన్న రోడ్డుపై అష్టకష్టాలు పడుతూ అరగంట ప్రయాణానికి గంటకు పైగా ప్రయాణించాల్సి వచ్చేది. ఆయా మండలాల ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్డు కష్టాలను గుర్తించిన ప్రభుత్వం దెబ్బతిన్న రహదారుల స్థానంలో కొత్తగా రోడ్డు నిర్మాణానికి నిడా పథకం కింద రూ. 11.50 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఈ మార్గంలో ఇటీవలే రోడ్డు నిర్మాణం పూర్తి కావడంతో ప్రయాణికులకు రహదారి కష్టాలు తీరిపోయాయి.

చురుగ్గా సీసీ రోడ్డు నిర్మాణ పనులు



బనగానపల్లెరూరల్: మండలంలోని యాగంటిపల్లె గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ గ్రామంలో ఇటీవల ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా గడప గడపను సందర్శించిన ఎమ్మెల్యేకు ప్రజలు సీసీ రోడ్లు, డ్రైనేజీ, తదతర సమస్యలను విన్నవించారు. ఈ మేరకు గ్రామ సచివాలయాల నిధులకు సంబంధించి రూ.20 లక్షలతో ఓసీ కాలనీతో పాటు పలు వీధుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆదేశాల మేరకు చేపడుతున్నట్లు సర్పంచ్ బండి వరలక్ష్మీ, మండల వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, గ్రామ వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బండి బ్రహ్మానందరెడ్డి తెలిపారు.